సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 27 । జూలై । 2025



రూ.50,116 విరాళం


అంబాజీపేట: కొర్లపాటివారిపాలెం శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రంకిరెడ్డి పెదకాపు, పల్లాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రంకిరెడ్డి వీర రాఘవులు (అబ్బులు) రూ.50,116 విరాళం సమర్పించారు.



శ్రీవారి ఆలయానికి రూ.1,00,116

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన ఆకుల నాని, పద్మావతి దంపతులు శనివారం రూ.1,00,116 విరాళం అందజేశారు.

పెరుగుతున్న వరద ఉధృతి



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ వద్ద వరద పెరుగుతోంది. శనివారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 4,36,321 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1800, ప శిమ డెల్టాకు 3,700 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ఏపీపీడీసీఎంఏ రీజినల్ కో ఆర్డినేటర్‌గా నాయుడు



అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) మూడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా అమలాపురానికి చెందిన విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు నియమితులయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జె.రమణారావు ఈ మేరకు నాయుడికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్‌గా నాయుడు అన్ ఎయిడెడ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను పర్యవేక్షించనున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో సంస్థాగతంగా, పాలనపరంగా, విద్యా పరంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నాయుడు పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రానున్న కాలంలో డిగ్రీ స్థాయిలో వివిధ కొత్త కోర్సుల ప్రారంభానికి తన వంతు ప్రయత్నిస్తానన్నారు. నాయుడు నియామకం పట్ల రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.రాజ్‌కుమార్ చౌదరి, రాజమహేంద్రవరం నన్నయ విశ్వవిద్యాలయం పరిధి అధ్యక్షుడు ఎండీ హబీబ్ బాషా, కార్యదర్శి ఎస్.కనకయ్య, ప్రిన్సిపాల్స్ బి.సుబ్బారాయుడు. బి.సుధీర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

వెండి కవచం సమర్పణ




కోలంక కేశవస్వామికి వెండి కవచం సమర్పిస్తున్న స్థానిక క్షత్రియ పరిషత్ సభ్యులు

కాజులూరు: కోలంకలో వెలసిన శ్రీలక్ష్మీకేశవ స్వామి వారికి శనివారం స్థానిక క్షత్రియ పరిషత్ సభ్యులు వెండి కవచం సమర్పించారు. దంతులూరి కుటుంబానికి చెందిన సాధుకృష్ణవర్మ, వెంకట సత్యనారాయణరాజు, వెంకట నరసింహరాజు, విశ్వనాథ వెంకట కేశవరాజు, కృష్ణవర్మ, వెంకట రాఘవరాజు, సుబ్బరాజు, వెంకట తిరుపతిరాజులు రూ. 7 లక్షలతో వెండి కవచం తయారు చేయించి దంతులూరి వెంకట విజయగోపాలకృష్ణరాజు, కృష్ణవేణి దంపతులచే ఆలయానికి అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవల్లి శ్రీనివాసాచార్యులు శనివారం సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించారు.

ఉపాధ్యాయులపై శిక్షణలను రుద్దడం సరికాదు

అమలాపురం టౌన్: వరల్డ్ బ్యాంక్‌కు సంబంధించిన సాల్ట్ పథకం, కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఈపీలో భాగంగా రకరకాల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణలను ఉపాధ్యాయులపై నిర్బంధంగా రుద్దడం సరికాదని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) జిల్లా శాఖ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు అన్నారు. ఇదే సమస్యను పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడికి పీఆర్‌టీయూ జిల్లా శాఖ తరఫున ఓ లేఖ ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ ప్రతికూల విధానాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న శిక్షణ, యాప్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వారు ఎమ్మెల్సీని అభ్యర్థించారు. ఈ కోర్సులు, శిక్షణలు నేర్చుకుని విద్యా శాఖకు చెందిన వివిధ యాప్‌లలో సమాచారం నింపడం వల్ల ఉపాధ్యాయులు తరగతి గదుల్లో చేసే బోధనపై తీవ్ర ప్రభావం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బోధనతో సమాంతరంగా శిక్షణ వద్దని వారు డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో ఇలా రకరకాల శిక్షణలతో బోధన - అభ్యాసనకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అన్నారు. ప్రస్తుతం అత్యవసమంటూ ప్రకటిస్తున్న 'ఐ గాట్ కర్మయోగి', 'ఎఫ్ఎల్ఎన్' ఆన్‌లైన్ శిక్షణ చేస్తున్నప్పుడు వచ్చే సర్వర్ సిగ్నల్ సమస్యలతో ఎంత ప్రయత్నించినా ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. దీని వల్ల కొందరు ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు గుర్తు చేశారు.

30న జాబ్‌మేళా



బాలాజీచెరువు: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఇ.వసంతలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ 20 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోందని, 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు హాజరుకావచ్చని, పదో తరగతి అపైన ఇంటర్మీడియెట్, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 86398 46568 నంబరులో సంప్రదించాలని సూచించారు.

హాస్టల్.. హడల్



రావులపాలెం సాంఘిక సంక్షేమ హాస్టల్-1లో శ్లాబ్ లీకులతో నిరుపయోగంగా గదులు



రావులపాలెం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో టైల్స్, తలుపులు పాడై నిరుపయోగంగా స్నానాల గదులు

- సమస్యల చెరలో సంక్షేమ వసతి గృహాలు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- కూటమి ప్రభుత్వంలో కొరవడిన పర్యవేక్షణ

సాక్షి, అమలాపురం/ రావులపాలెం/ అంబాజీపేట/ రాజోలు / కాట్రేనికోన: చదువరులకు సం'క్షేమం' దూరమైంది.. సౌకర్యాల కల్పన అందని ద్రాక్షలా మారింది.. సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో బాల్యం సతమతమవుతోంది.. చీకటి గదుల్లో పాట్లు, చాలీచాలని గదులు, అధ్వాన మరుగుదొడ్లతో అగచాట్లు, ఇలా ఒకటేమిటి అన్నీ అవస్థలే.. రాష్ట్రంలో వసతి గృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటాన్ని రాష్ట్ర హైకోర్టు తప్పు పట్టిన నేపథ్యంలో జిల్లాలో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాలను 'సాక్షి' నెట్‌వర్క్ పరిశీలించింది. అక్కడ విస్తుపోయే ఎన్నో సమస్యలు కనిపించాయి. విద్యార్థుల ఇబ్బందులు వెలుగు చూశాయి. వాటిని ఒకసారి చూద్దాం రండి.

జిల్లాలో 22 బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు 23 ఉండగా, ఇందులో సుమారు 2,100 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ముఖ్యంగా పేద వర్గాలకు చెందిన బాల బాలికలు ఉన్నత చదువులపై ఉన్న మక్కువతో ఇక్కడికి వస్తుంటారు. అటువంటి వారి కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో కనీస సదుపాయాల కల్పన.. విద్యార్థుల ఆరోగ్యం.. వారికి అందించే ఆహారం.. ఇలా సకల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్వహణను పూర్తిగా వదిలేసింది. జిల్లాలోని సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్లను చూస్తే కనీస వసతులు అంతంత మాత్రమే అని తెలుస్తోంది. చాలా వసతి గృహాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఇక్కడ కనీస వసతులు లేవు. మురుగుదొడ్లు చాలవు. పది మందికి ఒక టాయిలెట్, ఒక బాత్రూమ్ ఉండాలన్న నిబంధన ఇక్కడ అమలు కాదు. ఉన్నచోట పరిశుభ్రత లేదు. వర్షం నీరు లీకు అవుతోంది. స్వచ్ఛమైన తాగునీటికి ఆర్వో ప్లాంట్‌లు లేవు. కిటికీల నుంచి దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేయలేదు. ఉన్నచోట చిరిగిపోయాయి. దీంతో విద్యార్థినీ విద్యార్థులు దోమలతో నిత్యం సహవాసం చేస్తున్నారు. దీంతో సాధారణ, విష జ్వరాల బారిన పడుతున్నారు.

సిబ్బంది.. లేక ఇబ్బంది

రాజోలు ఎస్సీ బాలుర వసతి గృహానికి ఇన్‌చార్జి వార్డెన్ ఉండటం వల్ల హాస్టల్ పర్యవేక్షణ కొరవడింది. హాస్టల్ నూతన భవనం నిర్మాణంలో ఉండటంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. 57 మంది విద్యార్థులకు 5 గదులు మాత్రమే ఉన్నాయి. ఇరుకు గదుల కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. బాత్‌రూమ్‌లలో పైపులైన్లు పాడైపోవడంతో పిల్లలు నీరు మోసుకుని వెళ్లాల్సి వస్తోంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. రెండు హాస్టళ్లకు వార్డెన్లు ఇన్‌చార్జులు కావడం వల్ల వారానికి రెండు మూడు రోజులు మాత్రమే వస్తున్నారు. రెండు హాస్టళ్లు ఒకే కాంపౌండ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులకు దిగుతున్న సందర్భాలున్నాయి. బీసీ సంక్షేమ హాస్టల్‌లో సైతం సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. 10వ తరగతి విద్యార్థులకు ట్యూటర్ లేరు. విద్యార్థులకు భోజనం, చదువు, నిద్ర అన్ని ఒకే హాలులోనే. సిబ్బంది కొరత ఉంది. ఒక వార్డెన్, ఒక రెగ్యులర్ స్టాఫ్, ఒక ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాత్రమే ఉన్నారు.



రాజోలులో ఎస్సీ బాలుర వసతి గృహంలో 57 మంది విద్యార్థులకు ఒకేఒక్క మరుగుదొడ్డి

కను'మరుగు'.. స్నానాలు దేవుడెరుగు

రావులపాలెంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 1, 2లు బాలికల హైస్కూల్ పక్కన ఒకే భవనంలో ఉన్నాయి. రెండతస్తుల భవనంలో ఉన్న ఈ హాస్టళ్లలో పైన ఉండే అంతస్తులో హాస్టల్-1, కింది అంతస్తులో హాస్టల్-2ను నిర్వహిస్తున్నారు. ప్రతి అంతస్తులో ఏడు గదులు ఉన్నాయి. ఈ భవనంలో 160 మంది విద్యార్థులు ఉండేందుకు అనుమతి ఉంది. కానీ కనీస వసతులు లేక, 122 మంది మాత్రమే ఉంటున్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదుల కొరత తీవ్రమైంది. పది మందికి ఒక టాయిలెట్, ఒక బాత్రూమ్ ఉండాలన్న నిబంధన ఇక్కడ కానరావడం లేదు. మొత్తం 10 టాయిలెట్స్, పది బాత్రూమ్‌లు ఉండగా టాయిలెట్ నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది. ఇక ఐదు బాత్రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్న ఐదు వాటిలోనే బాలికలు స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పైఅంతస్తులో మూడు గదుల శ్లాబ్‌లు లీకవడంతో గదుల్లో వర్షం కురుస్తుంది. దీంతో రెండు గదులు నిరుపయోగంగా ఉండగా, మిగిలిన ఐదు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ గడపాల్సిన పరిస్థితి. ఇక వంట గది స్లాబ్ లీకవుతోంది. ఇక్కడ తాగునీటి కోసం ఏర్పాటైన ఆర్వో ప్లాంట్ పూర్తిగా పాడైంది. అదేవిధంగా హాస్టల్‌కు వెళ్లే దారి సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది.



అంబాజీపేట మండలం గంగలకుర్రు వసతి గృహం చుట్టూ కానరాని ప్రహరీ

కానరాని ప్రహరీ!

అంబాజీపేట మండలం గంగలకుర్రులో ఉన్న సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో 103 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ వసతి గృహం చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. ఇక్కడ రాత్రి వేళల్లో విద్యార్థులు భయపడుతున్నారు. వసతి గృహం చుట్టూ శుభ్రత లేనందున దుర్వాసన వెదజల్లుతుంది. విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు నెలలు గడుస్తున్నా రావడం లేదు. మామిడికుదురు బాలుర, బాలికల వసతి గృహాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. బాలుర వసతి గృహం చుట్టూ తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. డ్రైనేజీ సదుపాయం సక్రమంగా లేక మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. పి.గన్నవరం మండలం నరేంద్రపురంలోని గురుకుల పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ కూడా డ్రైనేజీ సదుపాయం సక్రమంగా లేదు. హాస్టల్ ప్రాంగణం పల్లంగా ఉండటంతో ముంపు నీరు నిలిచిపోతుంది. తరగతి గదులకు చెందిన తలుపులు, కిటికీలు పాడైపోయాయి. బాత్రూమ్ డోర్లు సక్రమంగా లేవని ఇటీవల విద్యార్థులు స్వయంగా మంత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ఫలితం లేదు.

నేలపైనే నిద్ర

కాట్రేనికోన బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో వార్డెన్‌తో పాటు ఇద్దరు సిబ్బంది, 18 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహం గోడలకు సున్నం వేయకపోవడం, గదుల్లో వెలుతురు లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. ఇది బూత్ బంగ్లాను తలపిస్తోంది. గదుల్లో ఫ్యాన్లు ఉన్నా కిటికీలకు దోమలు మెస్‌లు లేవు. 18 మంది రెండు గదుల్లోనే సర్దుకుని ఉంటున్నారు. దోమల కాటుతో విద్యార్థులు ఇక్కట్ల పాలవుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు దుప్పట్లు, జంబ్కానాలు ఇవ్వకపోవడం, చాపలు, బెడ్ సీట్లు లేక నేలపైనే చలిలో నిద్రిస్తున్నారు. ఆరు బయటే స్నానాలు చేస్తున్నారు.



కాట్రేనికోన బీసీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఆరు బయటే స్నానం చేస్తున్న విద్యార్థులు

బెల్టు షాపులు లేకుండా చూడండి



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఎక్సైజ్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అమలాపురం రూరల్: బెల్టు షాపులకు ఏ విధమైన ఆస్కారం లేకుండా ఎక్సైజ్ అధికారులు పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ శాఖ ఈఎస్, సీఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మద్యం షాపుల నిర్వాహకులు సమయ పాలన పాటించేలా చర్యలు చేపట్టడంతో పాటు కల్తీ మద్యం విక్రయాలు, రవాణా జరగకుండా నిరోధించాలన్నారు. నాటు సారా తయారీదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను మెరుగుపర్చండి

ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ మహేష్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని నాలుగు డిపోల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం వసతులు కల్పించాలన్నారు. డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణ మూర్తి, పి.భాస్కరరావు, దానమ్మ, అసిస్టెంట్ మేనేజర్ జీఆర్ఎల్ దేవి పాల్గొన్నారు.

వరద... వర్షం



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

- జిల్లాకు మరోసారి గోదావరి పోటు
- కాటన్ బ్యారేజీ నుంచి 4.36 లక్షల క్యూసెక్కుల విడుదల
- మరింత పెరగనున్న ప్రవాహం
- రెండు రోజులుగా ఒక మోస్తరు వానలు

సాక్షి, అమలాపురం: గోదావరికి మరోసారి వరద పోటు తగిలింది. గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలతో ధవళేశ్వరం బ్యారేజీకి రెండు రోజులుగా వరద జలాల రాక పెరుగుతోంది. కాటన్ బ్యారేజీ నుంచి శనివారం ఉదయం 3,52,011 క్యూసెక్కుల వరద నీరు చేరింది. సాయంత్రం ఆరు గంటల సమయానికి బ్యారేజీ నుంచి దిగువకు 4,36,321 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో పడుతున్న వర్షాల ప్రకారం వరద ఉధృతి సుమారు 5 లక్షల క్యూసెక్కుల వరకూ ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలా గోదావరి ఉధృతి పెరుగుతోంది.

వరద నీటి ప్రభావం దిగువన కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలపై పడింది. గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయలలో వరదనీరు ఉరకలేస్తోంది. పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టు, ఐ.పోలవరం అన్నంపల్లి అక్విడెక్టుల వద్ద వరద నీరు పోటెత్తుతోంది. ఇక్కడ క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరంలలోని నదీ గర్భంలోని లోతట్టు ప్రాంతాల లంక భూములను తాకుతూ వరద ప్రవహిస్తోంది. పి.గన్నవరంలో జి.పెదపూడిలంక, బూరుగులంక, ఊడుమూడిలంక, అరిగెలవారిపాలేనికి వెళ్లే తాత్కాలిక రహదారి ఈ నెల రెండో వారంలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీనితో ఈ లంక వాసుల రాకపోకలకు తాత్కాలికంగా పడవలు ఏర్పాటు చేశారు. తరువాత వరద తగ్గడంతో తిరిగి రాకపోకలు మొదలు కాగా, మరోసారి వరద పోటు తగలడంతో స్థానికులు పడవలను ఆశ్రయించక తప్పడం లేదు. వరద మరింత పెరిగితే ఈ మండలాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని కనకాయిలంక కాజ్‌వేపై నీరు చేరే అవకాశముంది. అదే జరిగితే ఇక్కడ వాహన రాకపోకలు నిలిచిపోనున్నాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోనున్నాయి. దీంతో జనం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద గోదావరి వరద ఉధృతి

కొనసాగుతున్న వానలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన వాయుగుండం ముప్పు తప్పింది. అయితే దీని ప్రభావంతో జిల్లాలో గురు, శుక్రవారాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ సగటున 10 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా రామచంద్రపురం మండలంలో 19.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా ఐ.పోలవరం మండలంలో 2.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది. ఆలమూరు 17.2, ఆత్రేయపురం 17, మండపేట 16, రావులపాలెం 15.6, కె.గంగవరం 14.8, కొత్తపేట 14.4, ముమ్మిడివరం 13.6, రాయవరం 12.8, కపిలేశ్వరపురం 11.2, పి.గన్నవరం 9.8, ఉప్పలగుప్తం 7.6, అంబాజీపేట 7.4, కాట్రేనికోన 6.8, అల్లవరం 6.6, అమలాపురం 6.2, మలికిపురం 4.8, అయినవిల్లి 4.6, సఖినేటిపల్లి 4.2, రాజోలులో 3 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో శనివారం జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నుంచి 22 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పి.గన్నవరం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కుడుపూడి త్రిమూర్తులు, మందపాటి సందీప్, గోగి జగదీష్, నేరేడుమిల్లి వినయ్, తాడి వెంకటేశ్వరరావు, తోటే దయా, ఊటాల రెడ్డి, వెంకటరత్నం, సవరపు కిశోర్, తవిటికి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, నేదునూరి రాజేష్, శ్రీనివాస్, అయినవిల్లి మధు తదితరులు పార్టీలో చేరారు. కూటమి అరాచక పాలనకు ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతుందని కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. అందుకే కూటమిని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, గ్రామ శాఖ అధ్యక్షుడు పోతుమూడి గోపాలకృష్ణ, కేదారిశెట్టి మల్లేశ్వరరావు, వాకపల్లి వీరాస్వామి, కాండ్రేగుల శ్రీను, కోలా సత్తిబాబు, చింతపల్లి శ్రీను, బొలిశెట్టి శ్రీను, వేగి వీరన్న, యనమదల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాడపల్లి వాసా.. శ్రీచిద్విలాసా



వాడపల్లి క్షేత్రంలో భక్తుల రద్దీ

కొత్తపేట: అనాథ రక్షకా.. ఆపద్బాంధవా.. గోవిందా.. గోవింద అంటూ భక్తులు ఆ స్వామివారిని కొలిచారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భారీ క్యూలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఏడు శనివారాల నోము ఆచరించే భక్తులు మాఢ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయ - ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి వివిధ సేవలు నిర్వహించారు. సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు.

గోదావరి రేవులో భద్రతా చర్యలు

గత శనివారం గోదావరి స్నానం చేస్తూ ఒక విద్యార్థి మృతి చెందిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని డీసీ అండ్ ఈఓ చక్రధరరావు గోదావరి రేవులో అదనపు సిబ్బందితో పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు చేశారు. నది వద్ద ఉన్న స్నాన ఘట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు జాగ్రత్తలను సూచించారు. ఈ ఒక్కరోజు దేవస్థానానికి స్వామివారి విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, నిత్యాన్నదానం, శాశ్వత అన్నదానం, లడ్డూ ప్రసాదం విక్రయం తదితర సేవల ద్వారా సాయంత్రం 5.30 గంటల వరకూ రూ.54,55,230 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాము బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



అప్పనరామునిలంకలో రోడ్డు మార్జిన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆగిన బస్సు

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో శనివారం 40 మంది విద్యార్థులతో ప్రయాణిస్తున్న కాన్వెంట్ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గ్రామంలో ఆ బస్సు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అనుకుని ఆగింది. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. దీంతో విద్యార్థులు ప్రమాదం నుంచి బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మరమ్మతులు చేయకుండా రోడ్లపైకి వస్తున్న ఇలాంటి బస్సులపై రోడ్ ట్రాన్స్‌పోర్టు అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే డ్రైవర్ల ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి పెట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్ విజ్ఞప్తి చేశారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

రెండు తాడిపెద్దుల మృతి

తుని: స్థానిక మార్కెట్ యార్డులో విద్యుత్ తీగలు తెగిపడిన సంఘటనలో రెండు తాడిపెద్దులు మృతి చెందాయి. శనివారం ఉదయం పశువులు ఆ మార్కెట్‌లోని వ్యర్థాలను తింటుండగా ఒక్కసారిగా విద్యుత్ తీగలు పడటంతో రెండు తాడిపెద్దులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ సమయంలో జనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ శాఖ లైన్ల నిర్వహణ సమయంలో తగు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరారు.



తుని మార్కెట్ యార్డులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన తాడిపెద్దులు

ప్రాణాలు పోయినా పట్టించుకోరా!

- రహదారులు దిగ్బంధించి మత్స్యకారుల నిరసన
- కాకినాడలో తీవ్ర ఉద్రిక్తత
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు



పోలీసులు, మత్స్యకారుల మధ్య వాగ్వాదం

కాకినాడ క్రైం: నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం తాళ్లరేవు సమీపంలో పటవల వద్ద చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, బాధిత కుటుంబాలు మత్స్యకార నేతల ఆధ్వర్యంలో న్యాయ పోరాటానికి దిగాయి. న్యాయం చేయాలని రోడ్డెక్కాయి. ఈ పరిస్థితి నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ప్రధాన కూడళ్లలో మూడుచోట్ల రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపారు. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సమన్వి ట్రావెల్స్ అధినేత రావాలని, ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న కాకినాడ జీజీహెచ్ మార్చురీ వద్ద మత్స్యకార నాయకుడు సంగాడి ఈశ్వరరావు సహా పెద్దలు నిరసన వ్యక్తం చేశారు. 60 మందితో మొదలైన ఈ నిరసన వెయ్యి మందికి చేరుకుంది. తొలుత జీజీహెచ్ వద్ద వార్ఫ్ రోడ్డులో బాధిత కుటుంబీకులు రోడ్డుపై బైఠాయించారు. అక్కడి నుంచి ర్యాలీగా వాహనాలతో కాలినడకన వెళ్లి జగన్నాథపురం కొత్త వంతెనపై నిరసన తెలిపారు. జగన్నాథపురం నుంచి వార్ఫ్ రోడ్డు నుంచి వెళ్లే మార్గాన్ని దిగ్బంధించారు. అక్కడి నుంచి పాత వంతెనపైకి వెళ్లి నిరసన తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, సమన్వి ట్రావెల్స్ అధినేతను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆ అధినేత అమర్‌నాథ్ యాత్రలో ఉన్నారని పోలీసులు చెప్పడంతో ఒక్కసారిగా మత్స్యకారులంతా మండిపడ్డారు. ప్రాణాలు తీసేసి యాత్రలు చేస్తుంటే కళ్లకు గంతలు కట్టుకున్నారా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే సహా డిప్యూటీ సీఎం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



రోడ్డుపై బైఠాయించిన మృతుల కుటుంబీకులు

కానరాని కొండబాబు

తన సామాజిక వర్గ పేదలు, అందులోనూ మహిళలు ప్రాణాలు కోల్పోతే కాకినాడ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్పందించిన తీరుపై మత్స్యకార నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. బాధితులు ఆయన దగ్గరకు వెళితే, బీమా వచ్చాక పరిహారం అందుతుందని, పరోక్షంగా తానేమీ చేయలేనని చేతులెత్తేశారని మత్స్యకారులు వాపోయారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆయన ఇంటికి కొద్ది దూరంలోనే నినాదాలు చేశారు. శుక్రవారం జీజీహెచ్‌కు వచ్చి మీడియాకు పోజులిచ్చి వెళ్లిపోయారని వారన్నారు. తన సొంత సామాజిక వర్గానికే న్యాయం చేయలేని వ్యక్తి కాకినాడకు ఏం చేస్తారని బాహాటంగానే విమర్శించారు. మూడు నిండు ప్రాణాలు పోతే ఇంతేనా చేసేదంటూ ప్రశ్నించారు.

మృతదేహాల తరలింపు

ఉద్రిక్తత తీవ్రరూపం దాల్చుతున్న తరుణంలో నిరసనకారులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో బస్సు యాజమాన్యంతో మాట్లాడిన పోలీసులు మత్స్యకార పెద్దలతో ప్రాథమిక దశ చర్చలు నిర్వహించి, నిరసనకు తాత్కాలిక విరమణ ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

క్షతగాత్రురాలికి కొనసాగుతున్న చికిత్స

ప్రమాద ఘటనలో గాయపడిన ఓలేటి లక్ష్మి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమెకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఎడమ కాలు, చేయిలో ఎముకలు విరిగాయని, శస్త్రచికిత్స చేస్తామని అన్నారు.

ఆరోగ్యవంతం.. కోరంగి మడ అటవీ ప్రాంతం



కోరంగిలో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజర్ వరప్రసాదరావు

తాళ్లరేవు: దేశంలోనే రెండో అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యం కల్‌కతాలోని సుందర్‌బన్స్‌తో పోలిస్తే ఆరోగ్యవంతమైందని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఎస్ఆర్ వరప్రసాదరావు అన్నారు. శనివారం కోరంగి బయోడైవర్సిటీ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవాన్ని వరప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరింగ అభయారణ్యంలో ఏడాదికి నాలుగు నెలలపాటు గోదావరి నీరు పుష్కలంగా లభించడంతో ఆరోగ్యవంతమైన వృక్ష, మత్స్య సంపద అభివృద్ధి చెందుతుందన్నారు. సునామీలు, తుపాన్ల నుంచి రక్షించే మడ అడవులను హోప్ ఐలాండ్ దీవిలో పెంచుతున్నట్లు తెలిపారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త కె.మృత్యుంజయరావు మాట్లాడుతూ మడ అడవులు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి 111 రకాల వలస పక్షులు వస్తున్నాయని, వాటిలో చాలావరకు సముద్ర పక్షులేనని తెలిపారు. ఫిషింగ్ క్యాట్ నిపుణులు కునాల్ గోకుల్, ఆల్ ఈజ్ వెల్ అధ్యక్షుడు ఎస్.కిషోర్‌కుమార్ తదితరులు మడ అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ తదితర అంశాలను వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు సింగ వీరభద్రరావు, కుంచే సిద్ధార్థ, ఎఫ్‌బీఓలు కె.మహేష్, కె.ధనుంజయరావు, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, డి.మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

- అడుగంటుతున్న ప్రజాస్వామ్య విలువలు
- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్యామలాంబ ఆలయ సెంటర్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యనారాయణరావు మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల ముందు రోజు కావాలనే అరెస్టు చేసినట్లు కనిపిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో కీలకమైన భావ ప్రకటన హక్కుని, వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య విలువలు అడుగంటిపోతున్నాయని సూర్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. బ్రిటిష్ వారు వదిలిన లెగసీని ప్రస్తుతం పోలీసులు అందిపుచ్చుకున్నారని అన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్, రాజ్యాంగ పండితులు ప్రజాస్వామ్యాన్ని ఉన్నత విలువలతో నిలబెట్టాలని చూశారన్నారు. రాజ్యసభలో ప్రభుత్వానికి బలం లేనప్పుడు మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడారని ఆయన అన్నారు. ఒక సాధారణ వ్యక్తిగా ఎలాంటి హంగూ ఆర్భాటం లేని మిథున్‌రెడ్డి వ్యక్తిత్వం రెండేళ్లుగా ఆయనతో చేస్తున్న ప్రయాణం వల్ల తనకు తెలిసిందన్నారు. రాజకీయ నాయకుడి కంటే, మాములు వ్యక్తిగానే ఆయన వ్యవహరిస్తారన్నారు. విచారణకు సహకరించేవాళ్లను అరెస్టు చేసి ఇబ్బంది పెట్టడం పోలీసులకు తగదన్నారు. ఇండియన్ పోలీస్ యాక్ట్‌ను అతిక్రమిస్తున్నారని ఆయన వాపోయారు. మిథున్‌రెడ్డిని భేషరతుగా బెయిల్‌పై విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా అని ఆధారాలు లేకుండా అరెస్టు చేస్తే ఎలాగన్నారు. ప్రజాస్వామ్య పోకడలు ఎక్కడికి పోతున్నాయని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డిని ప్రధాని మోదీ కౌగిలించుకుని వెన్నుపోటు పొడిచారని, ఇప్పుడు మంత్రి లోకేష్‌ని మోదీ కౌగిలించుకున్నారని రేపటి పరిస్థితి ఏంటో అని ఛలోక్తి విసిరారు. మిథున్‌రెడ్డితో ములాఖత్ కోసం ప్రయత్నిస్తున్నానని, ఇస్తారో లేదో చూడాలని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం, అమలాపురం లీగల్ సెల్ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, ఎం.ప్రసాద్, పిల్లి గంగాధర్, కురుమిల్లి శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ దూర విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రాయూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ద్వారా డిగ్రీ కోర్సులు అభ్యసించాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ కందుల ఆంజనేయులు శనివారం తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఎంకామ్, ఎంఏ, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇతర వివరాలకు 91543 79059 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

యువకుడి అదృశ్యం



చంద్రశేఖర్ (ఫైల్)

కె.గంగవరం: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కె.గంగవరం ఎస్సై జానీ బాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రామచంద్రపురం మండలం భీమకోసుపాలేనికి చెందిన కలిదిండి చంద్రశేఖర్(27) శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడికి చనిపోతున్నానని మెసేజ్ పెట్టి కనిపించకుండా వెళ్లిపోయాడు. చంద్రశేఖర్‌కు చెందిన మోటారు సైకిల్, సెల్ ఫోన్ సుందరపల్లి ఏటిగట్టుపై కనిపించాయి. గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానంతో గాలింపు చర్యలు చేపట్టాని ఎస్సై జానీ బాషా చెప్పారు.

హత్యాయత్నం కేసులో మరో ఇద్దరి అరెస్ట్

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలం వెలవెలపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు, ఒకేషనల్ కళాశాల అధ్యాపకుడు దోనిపాటి మహేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో మరో ఇద్దరు నిందితులను అమలాపురం పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మహేష్‌పై దాడి చేసిన ఆరుగురిలో ఇప్పటికే అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో ముగ్గురిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో అమలాపురం అశోక్‌నగర్‌కు చెందిన మల్లాడి సుదర్శన్, ఇమ్మిడివరప్పాడుకు చెందిన తోట నాగవెంకట సత్యనారాయణలను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరిని అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో ఇళ్ల వద్ద అరెస్ట్ చేసి, వారి నుంచి నేరానికి ఉపయోగించిన ఒక మోటారు సైకిల్, మూడు సెల్‌ఫోన్లు, బాధితుడు మహేష్ వద్ద లాక్కున్న ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.వీరబాబు తెలిపారు. నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేయాల్సి ఉందని అన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. కాకినాడ డీసీసీబీ కార్యాలయంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 52 డీసీసీబీ బ్రాంచ్‌ల్లో మేనేజర్లు, ఇతర సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నష్టాల బాటలో ఉన్న డీసీసీబీని రెండేళ్లలో లాభాల బాటలో నడిపించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రుణాల వసూళ్లు బాగుంటేనే డీసీసీబీ బాగుంటుందన్నారు. గతంలో బినామీ పేర్లతో రుణాలు అధికంగా ఇచ్చిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా రుణాల మంజూరుకు సహకరించిన బ్యాంకు సిబ్బందిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయా రుణాలను వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. పిఠాపురం బ్రాంచ్ పరిధి బి.కొత్తూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని తిరిగి కట్టడం లేదన్నారు. చిన్న గ్రామమైనప్పటికీ ఆ గ్రామంలో లేనివారి పేర్లతో కూడా రుణాలు తీసుకుని బ్యాంకుకు ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం ఇటువంటి రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ తరహా రుణాల మంజూరుకు ఏఏ అధికారులు సహకరించారో వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం అన్నీ బ్రాంచ్‌లు సిబ్బందిని ఎంత మేర రుణాలు ఇచ్చారు, ఎంత తిరిగి చెల్లించారు, రుణాలు రికవరీకి తీసుకొంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓ ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నమెంట్‌కు విరాళం



కలెక్టర్ షణ్మోహన్‌కు చెక్కు అందజేస్తున్న విజయ ప్రకాష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఆగస్టులో నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ జాతీయ జూనియర్ మహిళా టోర్నమెంట్‌కు శ్రీప్రకాష్ విద్యాసంస్థలు రూ.2 లక్షల సహకారం అందించాయి. జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ శనివారం కలెక్టర్ చాంబర్‌లో చెక్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకరించడం సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.